నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, గురువారం 27 జూన్ 2024 | BHADRADRI KOTHAGUDEM

నేడు భద్రాద్రి జిల్లాలో నలుగురు మంత్రుల పర్యటన

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 26 (నమస్తే తెలంగాణ) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు గురువారం పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి బయల్దేరి ఉదయం 10.40 గంటలకు కొత్తగూడెం ప్రగతి మైదానంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం విద్యానగర్ డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్స్ రూ.4 కోట్లతో చేపట్టనున్న సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. పోస్టాఫీస్ సమీపంలో అమృత్-2.0 నిధులు రూ.124 కోట్లతో కొత్తగూడెం మున్సిపాలిటీకి శాశ్వత మంచినీటి సరఫరా పథకం పనులకు శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 12.15 గంటలకు ముందస్తుగా గోదావరి వరదలపై కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షిస్తారు. మధ్యాహ్నం 1.45 గంటలకు హెలీక్యాప్టర్‌లో మణుగూరుకు వెళ్లి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును పరామర్శిస్తారు. అలాగే పద్మశ్రీ అవార్డు గ్రహీత రామచంద్రయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటన నేపథ్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

రేపు పాలేరులో జాబ్ మేళా

ఖమ్మం సిటీ/ కూసుమంచి, జూన్ 26: తెలంగాణ రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పాలేరులోని బీవీ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి జాబ్ మేళా నిర్వహించనున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీవైఎస్‌వో తుంబూరి సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో మేళా ఏర్పాటు చేశారు. ఇందులో ఫార్మసీ, ఐటీ, మార్కెటింగ్, హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్‌లు, కాల్ సెంటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, అడ్మినిస్ట్రేషన్, రియల్ ఎస్టేట్, రియల్టర్స్, హౌస్ కీపింగ్, స్టోర్ మేనేజర్, డెలివరీ బాయ్, వెల్డర్, ఫిట్టర్, ఎంఫార్మసీ, ఎంసీఏ, ఎంబీఏ వంటి కోర్సులు పూర్తి చేసిన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. డిప్లొమా, ఐటీ వంటి వాటిల్లో అర్హత గల వారు మేళాలో పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు. అభ్యర్థులు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 8886711991, 9642333668 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. జాబ్‌మేళాను వినియోగించుకొని ఉపాధి అవకాశాలు పొందాలని ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి నిరుద్యోగ యువతీ యువకులను కోరారు. కాగా, జాబ్‌మేళా నిర్వహణపై ఖమ్మం అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ ఖమ్మంలోని జడ్పీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగులు htpp:// forms.gle/aWH1uo5poS6RrT3D6 లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు సునీల్‌రెడ్డి, సోమశేఖరశర్మ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను విస్మరించిన కాంగ్రెస్

అన్ని రంగాలకు ప్రాధాన్యం ఇచ్చింది గత కేసీఆర్ ప్రభుత్వం

కేసీఆర్ ప్రభుత్వంలో మంజూరైన అభివృద్ధిని కొనసాగించాలి

విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అశ్వారావుపేట, జూన్ 26 : అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించిందని, ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కేసీఆర్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో అన్ని రంగాలకు ప్రాధాన్య ఇచ్చి అభివృద్ధి చేసి, సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చేసిందన్నారు. గిరిజన నియోజకవర్గమైన అశ్వారావుపేట అభివృద్ధికి అడిగిన వెంటనే కేసీఆర్ నిధులు విడుదల చేశారని, రూ.800 కోట్లకు పైగా అభివృద్ధి చేసినట్లు గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో మళ్ళీ కాబోయే సీఎం కేసీఆరేనని ఆయన జోస్యం చెప్పారు. గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని అలాగే కొనసాగించాలని సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేను ఆయన డిమాండ్ చేశారు. సెంట్రల్ లైటింగ్, తారు, సీసీ రోడ్లను పూర్తి చేయకుండా ఇప్పటి ప్రభుత్వం నిర్లక్ష్య దోరణి అవలంబిస్తోందని, ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. పదవులు, ఆస్తులను కాపాడుకునేందుకు పార్టీ మారే నేతలను పట్టించుకోమని, పార్టీకి బలమైన కార్యకర్తలే పునాది అని, వారికి ఏ కష్టమొచ్చినా పలికే విధంగా అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. తాను గత ఎన్నికల్లో గెలిచి ఉంటే అశ్వారావుపేట మండలం వినాయకపురం, దమ్మపేట మండలం పట్వారీగూడెం గ్రామాలను మండల కేంద్రాలు చేయడంతోపాటు అశ్వారావుపేట మేజర్ గ్రామ పంచాయతీ మున్సిపాలిటీ అయ్యేదని తెలిపారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలతోనే మార్పు చూడాలనే ఉద్దేశంతోనే ప్రజలు ఆ పార్టీని గెలిపించారని, కానీ.. బీఆర్ఎస్‌పై ప్రజల్లో ఎటువంటి వ్యతిరేకత లేదన్నారు. సోషల్ మీడియాలో బీఆర్ఎస్‌పై వచ్చే తప్పుడు ఆరోపణలను నమ్మొద్దని పార్టీ క్యాడర్, ప్రజలను కోరారు. తెలంగాణకు కేసీఆర్‌యే భవిష్యత్ అని, ఆయన కచ్చితంగా మళ్ళీ సీఎం అవుతారని పునరుద్ఘాటించారు. సమావేశంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, మాజీ జడ్పీటీసీ జేకేవీ రమణారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సత్యవరపు సంపూర్ణ, నాయకులు తాడేపల్లి రవి, కాసాని చంద్రమోహన్, హస్సేన్, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. జర పైలం

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం
- పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం
- వైరల్ జ్వరాలు ప్రబలకుండా వైద్యశాఖ ముందస్తు చర్యలు
- వసతిగృహాలపై స్పెషల్ ఫోకస్
- గిరిజన గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు
- 2లక్షల మంది నుంచి రక్తనమూనాల సేకరణ
- 131 హైరిస్క్ గ్రామాల్లో దోమలమందు పిచికారీ

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 26 (నమస్తే తెలంగాణ) : ప్రతి ఏటా వానకాలం సీజన్ వచ్చిందంటే చాలు మన్యంపై వ్యాధుల పంజా విసురుతూనే ఉంది. వైద్య శాఖ ఎంత అప్రమత్తంగా ఉన్నా ఏజెన్సీ జనం రోగాలబారిన పడకతప్పడం లేదు. గత ఏడాదితో పోల్చితే జ్వరాలు తగ్గుముఖం పట్టినప్పటికీ గ్రామాలు, పట్టణాల్లో మురుగు నీరు నిల్వ ఉంటూనే ఉంటుంది. మురికి కాలువల్లో నీరు నిల్వ ఉండి దోమలు స్వైరవిహారం చేయడంతో వైరల్ జ్వరాలు వెంటాడుతున్నాయి. దీంతో పేదలు ప్రైవేటు ఆసుపత్రులపాలై జేబులకు చిల్లు పెట్టుకోవాల్సిన పరిస్థితి దాపురిస్తున్నది. వైద్యారోగ్య శాఖ ఎన్ని ప్రయత్నాలు చేసినా జ్వరాలను నిలుపుదల చేయడంలో ఒకడుగు వెనక ఉన్నట్లే తెలుస్తుంది. ప్రస్తుతం వానలు పడుతున్నాయి.. ఆరోగ్య శాఖ ముందస్తు చర్యలు తీసుకోకపోతే ప్రజలు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉంటుంది. జనం కూడా పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నారు. మరి ఈ ఏడాది వైద్యారోగ్య శాఖ వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచిచూడాలి.

సుజాతనగర్ మండలం డేగలమడుగు స్కూల్‌లో నిల్వ నీటిలో తాగునీటి ట్యాంకు

డ్రైనేజీలన్నీ మురుగు కూపాలే..

పేరుకుపోయిన మురుగు

పంచాయతీలు, మున్సిపాలిటీల్లో డ్రైనేజీలు మురుగుకూపాలుగా దర్శనమిస్తున్నాయి. పాల్వంచ, కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని కాలువల్లో మురుగు పేరుకుపోయింది. పాఠశాలల్లో తాగు నీరు ట్యాంకుల పరిస్థితి దారుణంగా ఉంది. ట్యాంకుల వద్ద అపరిశుభ్రత ఉన్నా సంబంధిత ఉపాధ్యాయులు దానిపై దృష్టిపెట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి. పల్లెల్లో పశువుల కొట్టాలు, మేకలు, గొర్రెల పాకలు మురికి కూపాలకు అడ్డాలుగా మారుతున్నాయి.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు

ప్రతి పీహెచ్‌సీ నుంచి వైద్యులు, సిబ్బందితో కలిసి గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. కొత్తగా వచ్చిన కలెక్టర్ జితేశ్ వి పాటిల్ వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో ఆరోగ్య శాఖ మరో అడుగు ముందుకు వేసింది. దీంతో ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జ్వరాలకు సంబంధించిన మందులను సిద్ధంగా ఉంచుకున్నారు. ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి రోగుల పరిస్థితిని తెలుసుకుంటున్నారు. ముఖ్యంగా గొత్తికోయ గూడేలను జల్లెడ పడుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన ఆదివాసీలు గతంలో మలేరియా వచ్చిన వారికి పరీక్షలు చేసి క్లోరిక్విన్ మాత్రలు వేస్తున్నారు. మలేరియా ప్యారాసైట్ బాడీలో ఉండడం వల్ల అది ఇతరులకు వ్యాప్తి చెందే అవకాశం ఉండడం వల్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

2 లక్షల మంది నుంచి రక్తపూతల సేకరణ

ముందస్తు చర్యల్లో భాగంగా ఇప్పటికే ఆరోగ్య శాఖ ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో 2లక్షల మందికి రక్తనమూనాలు తీసి మందులు పంపిణీ చేశారు. దీనికితోడు వైద్య శిబిరాలు కూడా నిర్వహించారు. మూడు వేల మందికి డెంగీ శాంపిల్స్‌ను తీశారు. 30 వేల మందికి పారా చెక్ టెస్టింగ్‌లను చేశారు. దీంతోపాటు గ్రామాల్లోని మురికి గుంతల్లో దోమల నివారణకు కిమోపాస్ 5 లీటర్లు, డిప్లుబెంజారిన్ 2 కిలోలు ఆయా పంచాయతీలకు అప్పగించారు. 200 డెంగీ కిట్‌లను అందుబాటులో ఉంచారు. ఐటీడీఏ ద్వారా 2 లక్షల గంబూషియా చేపలను గుంతల్లో వదలడానికి సిద్ధం చేశారు.

గొత్తికోయ గ్రామంలో వైద్యశిబిరం

సర్కార్ హాస్టళ్లపై ప్రత్యేక ఫోకస్..

ఆశ్రమ హాస్టల్‌లో దోమలమందు పిచికారీ చేస్తున్న మలేరియా వైద్యశాఖ

జ్వరాలను అదుపు చేయడంలో భాగంగా వైద్యారోగ్య శాఖ ప్రభుత్వ వసతి గృహాలపై ఫోకస్ పెట్టింది. ఇప్పటికే 188 వసతి గృహాల్లో స్పెషల్ డ్రైవ్ పేరుతో దోమల మందు పిచికారీ చేయించింది. దీంతోపాటు 131 హైరిస్క్ గ్రామాలను గుర్తించి అక్కడ కూడా అడుగడుగునా స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని చేపట్టడంతో గత ఏడాదికంటే ఈ ఏడాది మలేరియా, డెంగీ కేసులు తగ్గుముఖం పట్టినట్లు వైద్యారోగ్య శాఖ లెక్కలు చెబుతున్నాయి. గత ఏడాది మలేరియా 88 కేసులు నమోదు కాగా.. డెంగీ 125 కేసులు వచ్చాయి. ఈ ఏడాది ఇప్పటివరకు మలేరియా 32 కేసులు, డెంగీ 11 కేసులు నమోదయ్యాయి. దీంతో మలేరియా అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అయినా రానున్న సమయం చాలా కీలకం కాబట్టి ఆరోగ్య శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే తప్ప జ్వరాలు అదుపులోకి రావని నిణుపులు అంటున్నారు.

వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు

ప్రతి ఏటా వానకాలం వచ్చిందంటే జ్వరాలు వస్తుంటాయి. ఈ ఏడాది ముందస్తు చర్యల్లో భాగంగా ఇప్పటికే దోమల మందు పిచికారీ మొదటి విడత పూర్తి చేశాం. ముఖ్యంగా పిల్లలు చదువుకునే హాస్టళ్లలో దోమల మందు చల్లించాం. హైరిస్క్ గ్రామాలపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాం. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది ఇప్పటివరకు మలేరియా, డెంగీ కేసులు తగ్గాయి. ఇప్పటికే 2 లక్షల మందికి బ్లడ్ శాంపిల్స్ తీశాం.

– డాక్టర్ భాస్కర్‌నాయక్, డీఎంహెచ్‌వో, భద్రాద్రి కొత్తగూడెం

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్, చిత్రంలో ఎస్పీ రోహిత్ రాజు

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 26 (నమస్తే తెలంగాణ)/ కొత్తగూడెం క్రైం : డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు కదలాలని, మత్తు పదార్థాలను అరికట్టేందుకు యువత, విద్యార్థులు యాంటీ డ్రగ్స్ కమిటీలో సభ్యులుగా చేరి డ్రగ్స్ సోల్జర్స్‌గా మారాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ నుంచి రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, దివ్యాంగులతో కలిసి చేపట్టిన ర్యాలీలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు పాల్గొన్నారు. ర్యాలీని ముందుగా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. పోస్టాఫీస్ సెంటర్‌లో డ్రగ్స్ దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కొత్తగూడెం రైల్వే స్టేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్రంలోనే భద్రాద్రి జిల్లా అతి పెద్దది అని, ఇంత పెద్ద సంఖ్యలో దివ్యాంగులు, వయోవృద్ధులు, యువత ఎండను సైతం లెక్క చేయకుండా ర్యాలీలో పాల్గొనడం స్ఫూర్తి కలిగిస్తుందన్నారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పట్టణాలు, మండలాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వారం రోజులపాటు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించున్నట్లు తెలిపారు. అలాగే ప్రదర్శనలు, ర్యాలీలు చేపట్టనున్నట్లు చెప్పారు. మన దేహం ఉన్నది దేశం కోసమని, మాదక ద్రవ్యాలు సేవించి దేహాన్ని పాడు చేసుకోవద్దని, సమాజ బాగు కోసం ఎంతో కొంత చేస్తే సార్థకత ఉంటుందన్నారు. ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడు తూ మత్తు పదార్థాల రవాణాదారులు, విక్రయదారులు, వినియోగదారులపై ఉక్కుపాదం మోపినట్లు చెప్పారు. ఛత్తీస్‌గఢ్, ఏపీ రాష్ట్రాల సరిహద్దున గల మన జిల్లా మీదుగా జరుగుతున్న గంజాయి రవాణాను సమర్థవంతంగా అడ్డుకుంటున్నట్లు తెలిపారు. గడిచిన ఆరు నెలల్లోనే 5,000 కేజీల గంజాయిని స్వాధీనపర్చుకుని కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు సుమారు 30వేల కేజీలకు పైగా గంజాయిని తగులబెట్టినట్లు తెలిపారు. గంజాయి రవాణాను నిరోధించడంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ రెహమాన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య, జిల్లా సంక్షేమాధికారి విజేత, మున్సిపల్ కమిషనర్ స్వామి, ఇంటర్మీడియట్ ఆఫీసర్ సులోచనారాణి, జిల్లా అధికారులు, పోలీస్ సిబ్బంది, దివ్యాంగులు, వయోవృద్ధులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

యాంటీ డ్రగ్స్ వారియర్లుగా నిలవాలి

ఖమ్మం పటేల్ స్టేడియం వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న సీపీ సునీల్‌దత్

- నవ సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలి
- మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీలో ఖమ్మం సీపీ
- అన్ని సబ్ డివిజన్లలోనూ యువతతో అవగాహన ప్రదర్శనలు

ఖమ్మం సిటీ, జూన్ 26: యువత.. యాంటీ డ్రగ్స్ వారియర్లుగా నిలవాలని ఖమ్మం సీపీ సునీల్‌దత్ ఆకాంక్షించారు. 'అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం – అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం' సందర్భంగా జిల్లా పోలీస్, సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలో బుధవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఖమ్మంలోని పటేల్ స్టేడియం నుంచి లకారం ట్యాంక్ బండ్ వరకు నిర్వహించిన ర్యాలీని సీపీ సునీల్‌దత్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ మార్పులోనూ, నవ సమాజ నిర్మాణంలోనూ యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మత్తు అనే మహమ్మారికి యువత బానిసలుగా మారవద్దని సూచించారు. మాదక ద్రవ్యాలు మనుషుల జీవితాలను నాశనం చేస్తాయని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చెడు అలవాట్లకు ఆకర్షితులు కావొద్దని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగమే సమాజంలో అన్నిటికంటే భయంకరమైన వ్యాధి అని అభివర్ణించారు. చాపకింద నీరులా అది వ్యాప్తి చెందకుండా ముందస్తుగా అప్రమత్తం కావాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని అన్నారు. మత్తు పదార్థాలను అరికట్టేందుకు యువత, విద్యార్థులు యాంటీ డ్రగ్స్ కమిటీల్లో చేరి సైనికులుగా పనిచేస్తూ ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ఎవరైనా గంజాయి విక్రయాలకు పాల్పడితే టోల్ ఫ్రీ నంబర్ 8712671111కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మత్తు పదార్థాల విక్రేతల పేర్లు వెల్లడించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు. గడిచిన ఆరేళ్లలో 204 కేసుల్లో 265 మందిని అరెస్ట్ చేసి రూ.11 కోట్ల విలువైన 9,008 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. గంజాయి మత్తుకు అలవాటు పడిన 165 మందికి సైకాలజిస్టుల పర్యవేక్షణలో కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. అనంతరం 'మాదక ద్రవ్యాల ఉచ్చులో పడకుండా మానవాళిని రక్షించేందుకు – మాదకద్రవ్యాల వాడకం లేని సమాజాన్ని ఆవిష్కరించేందుకు మావంతు సహకారం అందిస్తాం' అంటూ విద్యార్థులు, యువతీ యువకులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు.

సబ్ డివిజన్లలోనూ ర్యాలీలు..

వైరా, కల్లూరు, ఖమ్మం రూరల్ పోలీసు సబ్ డివిజన్లలోనూ ఆ శాఖ అధికారులు యువతతో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. అయితే, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై వారం రోజులపాటు విద్యాసంస్థల్లోని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని సీపీ తెలిపారు. ఈ ర్యాలీల్లో డీడబ్ల్యూవో రాంగోపాల్‌రెడ్డి, ఏడీసీపీలు ప్రసాద్‌రావు, నరేశ్‌కుమార్, ఏసీపీలు రమణమూర్తి, శ్రీనివాసులు, సీఐలు భానుప్రకాశ్, శ్రీహరి, రమేశ్ పాల్గొన్నారు.

ఖమ్మంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, వివిధ శాఖల అధికారులు

సాగు చేయని భూముల సర్వే

- నాన్ క్రాప్ బుకింగ్ భూములపై సర్కారు నజర్
- జిల్లావ్యాప్తంగా పాలాల్లో ఏఈవోల సర్వే ప్రారంభం
- ఎల్లుండిలోగా పూర్తి చేయాలంటూ ప్రభుత్వ లక్ష్యం
- సర్వేలో లేని నంబర్లపై అన్నదాతల అయోమయం
- రాష్ట్రంలోని పైలట్ ప్రాజెక్టుల్లో ఖమ్మం జిల్లాకూ స్థానం

ఖమ్మం అర్బన్‌లో ఏఈవో చేస్తున్న సర్వేను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు

ఖమ్మం వ్యవసాయం, జూన్ 26 : గత వానకాలం సీజన్‌లో సాగులో లేని భూముల వివరాలు, వాటి స్థితిగతులను తెలుసుకునేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక సర్వేను చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాలను పైలట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేయగా.. వాటిలో ఖమ్మం జిల్లా కూడా ఉంది. అందులో భాగంగానే ఈ నెల 25 నుంచి జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి సర్వే ప్రారంభమైంది. ఈ సర్వేలో జిల్లాలోని 130 క్లస్టర్లకు చెందిన వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులతో పాటు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు చెందిన ఉద్యోగులు కూడా పాల్గొంటున్నారు. ఈ నెల 29లోపు నిర్దేశించిన విధంగా సర్వే పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. గడిచిన పదేళ్ల నుంచి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వానకాలం, యాసంగి సీజన్లలో పంటల సాగు ప్రారంభం కాగానే ఏఈవోలు క్రాప్ బుకింగ్ సర్వే చేపడుతున్నారు. ఈ సర్వే ఆధారంగా 'సాగు విస్తీర్ణం ఎంత జరిగింది? దిగుబడి అంచనా ఎంత ఉంది? మార్కెట్లపై పడే ప్రభావం ఎంత?' అనే అంచనాలను ప్రభుత్వం ముందుగానే తెలుసుకునే అవకాశం ఉంటుంది. అయితే ప్రస్తుత సర్వే కోసం రాష్ట్ర ప్రభుత్వం ఓ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. నిరుడు వానకాలం సీజన్‌లో క్రాప్ బుకింగ్‌లోకి రాని సర్వే నంబర్ల భూముల వివరాలను తెలుసుకొని వాటి వివరాలను అధికారులు ఈ యాప్‌లో పొందుపరుస్తారు. 'సాగు చేయకపోవడానికి కారణాలేమిటి?' అనేది క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆ యాప్‌లో నమోదు చేస్తారు. 'సాగునీరు లేకపోవడం వల్లనా?, అది రియల్ ఎస్టేట్ భూమి అయినందువల్లనా?, నివాస ప్రాంతం కావడం వల్లనా?, అవి పరిశ్రమల భూములు అయినందువల్లనా?' అనే వివరాలు సేకరిస్తారు. అలాగే 'ఆ భూమిని ఎన్నేళ్లుగా సాగు చేయడం లేదు? రైతు ఆర్థిక పరిస్థితి బాగాలేక సాగు చేయడం లేదా?' అనే వివరాలను కూడా సర్వే అధికారులు సదరు యాప్‌లో నమోదు చేస్తారు. కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే క్రాప్ నాన్ బుకింగ్ ర్యాండమ్ సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం తన ఆదేశాల్లో పేర్కొన్నది.

అన్నదాతల అయోమయం..

నిరుడు క్రాప్ బుకింగ్ చేపట్టిన ఏఈవోలే ఇప్పుడు మరోసారి నాన్ క్రాప్ బుకింగ్ భూముల సర్వే చేస్తున్నారు. యాప్ ఓపెన్ చేస్తే.. 'ఒక్కో ఏఈవో ఎన్ని సర్వే నెంబర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించాడు?' అనే విషయం తెలుస్తుంది. అలాగే, సదరు ఏఈవోలు క్షేత్రస్థాయిలో నిర్ణీత సాగు భూమి పరిస్థితి అర్థమయ్యేలా ఫొటో తీసి దానిని ఆ మొబైల్ యాప్‌లో పొందుపరుస్తున్నారు. అయితే, ప్రసుత్తం ర్యాండమ్‌గానే నాన్ క్రాప్ బుకింగ్ సర్వే చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. కానీ.. సాగులో లేని భూముల పూర్తి సర్వే నంబర్లు యాప్‌లో లేకపోవడంతో ఆ సర్వే నంబర్ల రైతులు అయోమయానికి గురవుతున్నారు. 'మా భూములు ఎందుకు సర్వే చేయడం లేదు?' అంటూ క్షేత్రస్థాయిలో సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. అయితే ఈ సర్వేను కేవలం ర్యాండమ్‌గానే చేస్తున్నామని ఏఈవోలు చెబుతున్నప్పటికీ అన్నదాతల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 'మా భూమిని గతంలో సాగు చేయలేదు. కానీ.. ఈ ఏడాది సాగు చేయబోతున్నాం.' అని చెబుతున్నారు. ఈ సర్వేలో తమ భూమి సాగులో లేనట్లు నమోదైతే రాబోయే రోజుల్లో రైతుభరోసా పథకానికి దూరమవుతామేమోననే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సాంకేతిక సమస్యల కారణంగా రాబోయే రెండు రోజుల్లో సమగ్ర సర్వే చేపట్టడం కష్టమని ఏఈవోలు వాపోతున్నారు. అయితే వ్యవసాయ శాఖ చేపట్టిన ఈ సర్వే ముఖ్య ఉద్దేశం తమకు తెలియదని, ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే చేస్తున్నామని ఏఈవోలు చెబుతున్నారు. కానీ.. అన్నదాతలు మాత్రం తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారు. రైతుభరోసా పథకానికి ఎంపిక కోసమే కావొచ్చని భావిస్తున్నారు.

గనుల వేలం రద్దు చేయాల్సిందే..

తెలంగాణ సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక డిమాండ్

కొత్తగూడెం సింగరేణి, జూన్ 26 : రాష్ట్రానికే తలమానికమైన సింగరేణి బొగ్గు గనులను వేలం వేసే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని తెలంగాణ సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థకు పూర్వవైభవం తేవడం కోసం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ